క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ పరిధిలో మంగళవారం నీటి సరఫరా ఉండదని బల్దియా నీటి సరఫరా విభాగం ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశాయిపేట లేబర్ అడ్డా 80 ఫీట్ల రోడ్డు ప్రాంతంలో ప్రధాన పైపు లైన్ 1000 ఎంఎం డయా పైపు లీకేజీకి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. దాంతో ఫిల్టర్‌బెడ్ పరిధిలోని దేశాయిపేట, ఎస్ఆర్‌టీ, చార్‌బౌలి, కాశిబుగ్గ, ఏనుమాముల, ముచ్చర్ల, ఐ–హాస్పిటల్, మట్టివాడ, గోవిందరాజుల గుట్ట, వరంగల్ చౌరస్తా, కొత్తపేట, మొగిలిచర్ల, ధర్మారం, పైడిపల్లి, ఆరెపల్లి, కీర్తినగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు.

కాంట్రాక్టు లెక్చరర్ల మౌన ఆవేదన



విద్యారణ్యపురి: ప్రభుత్వ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం వద్ద భోజన విరామ సమయంలో నాల్గవ రోజు సోమవారం కాంట్రాక్టు లెక్చరర్లు ప్లకార్డులు పట్టుకుని మౌన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈమేరకు క్యాంపు ఆఫీసర్ జిల్లా డీఐఈఓ గోపాల్, ఏసీఓ జనరల్ –1 ధర్మేంద్ర, ఏసీఓ జనరల్ –2 కవితకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా (475) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, బాధ్యులు విజయమోహన్, రాజిరెడ్డి, హరగోపాల్, గణేష్, రవికుమార్, కిరణ్, తాగ్వాయి అశోక్, సువర్ణ, రజియా, రాయపర్తి శ్రీను, మహేందర్ పాల్గొన్నారు.

డాక్టర్ కాళీప్రసాద్‌కు సన్మానం



ఎంజీఎం: అమెరికాలోని అట్లాంటాలో జరిగిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా (టీఏఎంఏ) ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు – స్వర్ణలత దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు.

నిత్యావసరాల పంపిణీ



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో 150 మంది ముస్లిం పేద కుటుంబాలకు దాతలు నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాయపుర కాలనీకి చెందిన దాతలు రిజ్వాన్ ఖాజా, సాహిద్ అనే దాతలు ఇంటింటికి వెళ్లి వస్తువులను అందజేశారు.

కాజీపేట దర్గాలో..



కాజీపేట రూరల్: దీనబంధు సేవా సమితి రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో వృద్ధులు, పేదలు, వితంతువులు, వికలాంగులకు కాజీపేట దర్గాలో నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. దీనబంధు సేవా సమితి నాయకులు రాందాస్, రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, నాయకులు మామిడాల నరేందర్, భాస్కర్, జి.రాకేష్, ప్రమోద్‌కుమార్, వినయ్‌కుమార్, మామిడాల గౌరిశంకర్, అర్జున్, వేణుప్రసాద్ పాల్గొన్నారు.

'భగరథ'తోనే నీటి కష్టాలు

వరంగల్: మిషన్ భగరథ కనెక్షన్ ఇచ్చిన నాటి నుంచి తాగునీటి ఎక్కువయ్యాయని 12వ డివిజన్ డాక్టర్స్‌కాలనీ –1 నివాసి రిటైర్డ్ టీచర్ రాజేంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని, ఈవిషయం అధికారులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గతంలో మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నీటి సరఫరా బాగుండేదని అభిప్రాయపడ్డారు. పోచమ్మమైదాన్ – దేశాయిపేట ప్రధాన రహదారిపై లీకేజీ ఏర్పడి రెండు రోజులుగా నీరు పోతున్నా పట్టించుకున్న వారు లేరని వాపోయారు.

కార్పొరేటర్ భర్తకు బెయిల్

వరంగల్: ఏనుమాముల ప్రాంతంలోని భూ ఆక్రమణల కేసులో రిమాండ్‌పై జైలుకు వెళ్లిన కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త తూర్పాటి సారయ్య, మరో నిందితుడు టి.శ్రీనివాస్‌లు షరతులతో కూడిన బెయిల్‌పై సోమవారం విడుదలైనట్లు ఏనుమాముల ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు. 14వ డివిజన్ పరిధిలోని భూ ఆక్రమణలకు పాల్పడిన ఆరోపణలపై మాజీ జెడ్పీటీసీ సారయ్య, కుమారుడు తూర్పాటి హరిప్రసాద్, మాజీ కార్పొరేటర్ తూర్పాటి రఘు, తూర్పాటి శ్రీనివాస్‌లను గతనెల 28న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు

హన్మకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్లలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లలో ప్రజలు తమ వినతి పత్రాలను అందజేశారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి, పేదలకు రెండు పడక గదుల ఇళ్లు ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.6 లక్షల ఆర్థికసహాయం అందించాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో 200 రోజులు పనులు కల్పించి రోజుకు రూ.600 చొప్పున కూలీ చెల్లించాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి వినతి పత్రం అందించారు. ధర్నాలో లింగారెడ్డి, మద్దెల ఎల్లేష్, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం

హన్మకొండ: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం ఆగదని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) హనుమకొండ జిల్లా కన్వీనర్ నీల రవీందర్, వరంగల్ పార్లమెంటరీ కోకన్వీనర్ మాస్ సావిత్రి అన్నారు. సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో పేదలు ర్యాలీగా చేరుకుని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు. ధర్నాలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌రెడ్డి.హంస రెడ్డి ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, బీఎల్ఎఫ్ నాయకులు భూమయ్య, ఉదయ రామ్మోహన్, బానేష్, కళ్యాణి, సుధాకర్, మొగిలి, పార్వతి, అశ్విని పాల్గొన్నారు.

అక్రమణ కట్టడాలను తొలగించాలి

హసన్‌పర్తి: భీమారంలోని శ్యామల చెరువులో అనధికారికంగా వెలిసిన అక్రమ కట్టడాలను తొలగించాలని స్థానికులు కోరారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రెండు నెలల క్రితం చెరువులో జాయింట్ సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. సుమారు 30 ఎకరాల మేర చెరువు శిఖం కబ్జాకు గురైనట్లు అధికారులు వెల్లడించినట్లు తెలిపారు.

దానం చేసిన భూమిని కబ్జా చేస్తున్నారు

గ్రామాభివృద్ధి కోసం దానం చేసిన భూమిని కొంత మంది కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని స్థానికులు వాపోయారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో హనుమకొండ కలెక్టర్ సిక్కా పట్నాయక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎల్లాపురం శివారులోని సర్వే నంబర్ 246/1లో సుమారు 0.32 ఎకరాల భూమిని హసన్‌పర్తికి చెందిన చకిలం రాజలింగం అనే దాత 50 ఏళ్ల క్రితం దానం చేశారని తెలిపారు.

కలెక్టరేట్ల ఎదుట పెన్షనర్ల ధర్నా



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

హన్మకొండ: ఆల్ ఇండియా పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీ పెన్షనర్లు హనుమకొండలోని వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ల ఎదుట సోమవారం ధర్నా చేశారు. ధర్నాలో ఆయా సంఘాల నాయకులు కృష్ణ స్వామి, సత్యనాథ్, అశోక్ కుమార్, సూర్యలక్ష్మి, నారాయణ, రాంచందర్, బుచ్చయ్య, లక్ష్మణమూర్తి, రాబిన్‌సన్, రాజేశ్వర్, వెంకటేశ్వర్లు, సారంగపాణి, మారయ్య, సాంబరెడ్డి, రాంకిషన్, సజ్జద్‌అలీ పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్ వద్ద..

వరంగల్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్టేట్ గవర్నమెంట్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జీపీఏటీ)జిల్లా అధ్యక్షుడు కె.సుధీర్‌బాబు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు ఉచితంగా వైద్యం అందించాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసిన విధంగా డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్), డీఏ విడతల వారీగా విడుదల చేయాలన్నారు. డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేకు మెమోరాండం సమర్పించారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాల పట్టాలు



సాయినగర్ వాసులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్

హన్మకొండ: అర్హులైన నిరుపేద లబ్ధిదారులందరికీ జీఓ నంబర్ 58ప్రకారం ఇళ్ల పట్టాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చెప్పారు. స్లమ్ దర్శన్‌లో భాగంగా అధికారులతో కలిసి హనుమకొండలోని సాయినగర్‌ను చీఫ్‌విప్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 30 వరకు ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, కాలనీ వాసులు పాల్గొన్నారు. కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, కల్పలత సూపర్‌బజార్ ఎండీ జగన్మోహన్, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి పాల్గొన్నారు.

పూలే జయంతి ఏర్పాట్ల పరిశీలన

కాజీపేట అర్బన్: ములుగు రోడ్డులోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ సోమవారం సందర్శించారు. మంగళవారం జరగనున్న పూలే జయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాట్లను చీఫ్‌విప్ పరిశీలించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సుశీల్ గార్డెన్స్‌లో అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

నేడు కలెక్టరేట్‌లో పూలే జయంతి

వరంగల్: జ్యోతిబాపూలే జయంతిని మంగళవారం ఉదయం వరంగల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి. ప్రావీణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొననున్నట్లు కలెక్టర్ తెలిపారు.

12రకాల సరుకులు పంపిణీ చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు 12రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని పీఓడబ్ల్యూ పీవైఎల్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ అధ్యక్షుడు మోహన్, నాయకుడు మైదం పాణి డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోటలో ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా సంయుక్త ఆధ్వర్యంలో పేదల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు వంటనూనె, కందిపప్పు, పెసరపప్పు, గోధుమ పిండి, పంచదార, టీపొడి, ఉప్పు, కారం, పసుపు, చింతపండు, పల్లీలు, సబ్బులు, కొబ్బరినూనె వంటి 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా సరఫరా చేయాలని సూచించారు. అలాగే, కేంద్రం 5కిలోలు, రాష్ట్రం 5కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సుగుణ, లలిత, గీత, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలి



నినాదాలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ నాయకులు, కార్యకర్తలు

కాజీపేట రూరల్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి డిమాండ్ చేశారు. కాజీపేట దర్గాలోని అంబేడ్కర్ భవనంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని మహిళకు కేటాయించాలని సూచించారు. హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బౌద్ధ సంప్రదాయం ప్రకారం జరగాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బందెల యశోద, కనకలక్ష్మి, కుమమల్ల సుజాత, రమేష్‌కుమార్, ఉసిల్ల దయాసాగర్, మన్నె శ్రీనివాస్, బందెల రజిత, మన్నె లత, గుడిపాటి విజయలక్ష్మి, బండి సతీష్, పూనమల్ల సుచరిత, బందెల కళావతి, బందెల రాజేశ్వరి, కునమల్ల వాణి, నెలకంటి సుభద్ర పాల్గొన్నారు.

దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కాశిబుగ్గ: అర్ధరాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దాంతో అతడి రెండు కాళ్లు, ఒక చేయి విరిగిపోయింది. ఈ ఘటన ఆదివారం కాశిబుగ్గ పాత స్టాండర్డ్ స్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ 19వ డివిజన్ వివేకానందకాలనీకి చెందిన సిరివెల్ల వినోద్ ములుగు రోడ్డులోని ఓ కార్ల షోరూంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఓసిటీలోని ఫంక్షన్‌కు వెళ్లి అర్ధరాత్రి వివేకానందకాలనీలో తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో అదే రోడ్డుపై ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అతివేగంగా అతని పక్కనుంచే దూసుకెళ్లడంతో మెల్లగా పోవాలంటూ వారిని వినోద్ హెచ్చరించాడు. దాంతో వారు కోపోద్రిక్తులై అతన్ని తీవ్రంగా కొట్టగా, అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయినట్లు భావించి వారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. వినోద్ అన్న హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపారు.

పథకాలను చూసి పార్టీలో చేరుతున్నారు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

కాశిబుగ్గ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిపాలన దక్షత, కేంద్రం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు బీజేపీలో చేరుతున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఓసిటీలోని ఎర్రబెల్లి నివాసంలో వరంగల్ 27వ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీజేపీలో సోమవారం చేరారు. ఈమేరకు వారందరికీ కండువాలు పార్టీలోకి ఈటల రాజేందర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్, ప్రదీప్‌రావు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన పట్ల ప్రజలు అసహనంతో ఉన్నారని విమర్శించారు. కార్యకర్తలు సైనికులా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్, కోశాధికారి వన్నాల వెంకటరమణ, తుల ఉమ, అశోక్‌రెడ్డి, యోగానంద్, మార్టిన్ లూథర్, సురేందర్, రత్నం కిషోర్, మహేష్ ఉన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీకాంత్

విద్యారణ్యపురి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్‌సుల్తానా, కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలో విన్నర్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థి నిరుద్యోగ సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11న హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ, డీఎఫ్ఐల ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాదీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, కేయూ అధ్యక్షుడు సభావత్ హాతిరామ్, సాయి, రూపేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఆనందాచారికి సన్మానం



ఆనందాచారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

దేశాయిపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో శ్రీశ్రీకళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నలభై ఎనిమిది గంటలపాటు ప్రపంచ రికార్డు కోసం నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని అద్భుతమైన కవితాగానం చేసిన 3వ డివిజన్‌లోని పైడిపల్లి ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు తంగెళ్లపల్లి ఆనందాచారిని నిర్వాహకులు ఆదివారం సన్మానించారు. ఈమేరకు ఆనందాచారిని శ్రీశ్రీకళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, ప్రోగ్రాం ఆర్గనైజర్ రమావతి, కన్వీనర్ హరిసర్వోత్తమ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఈశ్వరీ భూషణం, చిట్టిసిద్ధ లలిత అమ్మాజీ, తెలంగాణ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అభినందించారు. ఆనందచారికి పైడిపల్లి పాఠశాల హెచ్ఎం జలజ, ఉపాధ్యాయులు కళాధర్, ఆనంద్, శ్రావణ్‌కుమార్, రాధాకృష్ణ, శోభన్‌బాబు, జన్ను బాబు, నాగలక్ష్మి, శివప్రియ, విజయలక్ష్మీరాణి, రహమత్‌బీ, అనిత అభినందనలు తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



స్వరూపకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: అభివృద్ధిలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సూచించారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలోని స్వగృహంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య స్వరూపరాణి జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 57వ డివిజన్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్, నాయకులు చెరుకు వెంకట రాజిరెడ్డి, బంక రమేష్, బొల్లు రవి, కటంగూరి నర్సింహరెడ్డి, కృష్ణారెడ్డి, మల్లారెడ్డితో తదితరులు పాల్గొన్నారు.


క్రైం కార్నర్

మద్యం బాటిళ్ల పట్టివేత



ఖిలా వరంగల్: రైలు మార్గం ద్వారా వరంగల్ మహానగరానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి 750ఎంఎల్ 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం సాయంత్రం వరంగల్ పుప్పాలగుట్టలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో చైతన్యపురికి చెందిన బిరదర్ మంగేష్(22) బ్యాగును పరిశీలించగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని వివరించారు. దాడుల్లో ఎస్సై బి.సరిత, హెడ్‌కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ ఎ.చిరంజీవి, కరుణాకర్, అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



నర్సమ్మ (ఫైల్)

కాశిబుగ్గ: 20వ డివిజన్ కాశిబుగ్గ పద్మనగర్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు ఆడెపు నర్సమ్మ (110) ఆదివారం సాయంత్రం వయోభారంతో మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, పదకొండు మంది మనువళ్లు, పది మంది మనుమరాళ్లు, 20 మంది ముని మనుమళ్లు, ముని మనుమరాళ్లు ఉన్నారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

సంక్షిప్తంగా

ఉద్యోగ భర్తీపై సమగ్ర విచారణ జరపాలి

కాశీబుగ్గ సెంటర్: నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగ భర్తీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని పలువురు నిరుద్యోగులు సోమవారం కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందించారు. 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన 'నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగ భర్తీ' అనే కథనానికి పలువురు నిరుద్యోగులు స్పందించి కలెక్టరేట్ ఏఓ, జిల్లా శిశు సంక్షేమ ఆశాఖ కమిషనర్, ఆర్జేడీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా స్థానికులకు కాకుండా మంచిర్యాల జిల్లాలో విధులు నిర్వహించి రాజీనామా చేసిన వ్యక్తికి ఉద్యోగం భర్తీ చేయడం అన్యాయమన్నారు.

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలోని 6 మోడల్ స్కూల్స్‌లో ఈ విద్యాసంవత్సరానికి గాను 6నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఈ నెల 16న నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12గంటల వరకు, 7వ తరగతినుంచి 10వ తరగతి ప్రవేశానికి మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.విద్యార్థులు హాల్‌టికెట్స్ కోసం తెలంగాణఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

బట్టల వర్తక సంఘం కార్యవర్గం ఎన్నిక



నమఃశివాయ, అధ్యక్షుడు



ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి

వరంగల్ చౌరస్తా: వరంగల్ జిల్లా హోల్‌సేల్ బట్టల వర్తక సంఘం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈమేరకు వరంగల్ రామన్నపేటలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా నమఃశివాయ, ప్రధాన కార్యదర్శిగా కోమండ్ల ప్రభాకర్ రెడ్డి, కోశాధికారిగా అల్లాడి వరప్రసాద్, కన్వీనర్‌గా తోట మహేష్, ఉపాధ్యక్షుడిగా తోట సోమేశ్వర్, సహాయ కార్యదర్శి సామల రమేష్, కార్యవర్గ సభ్యుడి మంచాల కృష్ణమూర్తితో పాటు మరికొంత మందిని కార్యవర్గంలోకి తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట: రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు కాజీపేట పట్టణంలో అసోసియేషన్ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. కాజీపేట అధ్యక్షుడు బుక్క సిద్ధి రాజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వీరన్న, శంకర్ లింగంతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి భగ్నం

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ క్యాంపు కార్యాలయం ముట్టడిని పోలీసు భగ్నం చేశారు. టీఎస్‌పీఎస్సీ, 10వ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఈక్రమంలో ఈనెల 10న ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండ జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి సన్నద్ధం కాగా, సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి హనుమకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

శిష్యులు మెచ్చిన గురువులు పుస్తకావిష్కరణ

కాజీపేట అర్బన్: చీకోలు సుందరయ్య రచించిన శిష్యులు మెచ్చిన గురువులు అనే పుస్తకాన్ని హనుమకొండ హంటర్‌రోడ్డులో మాజీ మంత్రి పురుషోత్తమరావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ అనుమాండ్ల భూమయ్య, రాజమల్లయ్య తనయుడు రామనర్సయ్య, ఎన్నారై క్లబ్ అధ్యక్షుడు ఎంఏ.ఖాన్, డాక్టర్ కొట్టి భాస్కర్, కొమరయ్య, దుర్గం రవీందర్, శ్రీధర్, గణేష్ గందె, రామచందర్‌రావు, రఘుశ్రీ, సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తిలో రాణించాలి

హన్మకొండ: న్యాయవాద వృత్తిలో రాణించాలని రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య ఆకాంక్షించారు. నూతన న్యాయవాదులుగా నమోదైన దండు మోహన్, రౌతు క్రాంతికుమార్, మౌనికను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాల నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో దామెర నర్సయ్య, ప్రజా సంఘాల నాయకులు బండి అశోక్, డాక్టర్ వెంకట్, రౌతు రమేష్ కుమార్, సందీప్, నక్క సుదర్శన్, కృష్ణస్వామి, నర్సయ్య, సురేందర్, కృష్ణప్రసాద్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమాధికారిపై చర్య తీసుకోవాలి

వరంగల్: వరంగల్ జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిపై చర్య తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు, ఎంఎస్‌పీ నాయకులు ఈర్ల కుమార్ సోమవారం అదనపు కలెక్టర్ శ్రీవత్స కోటకు ఫిర్యాదు చేశారు. బీసీ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిపై వచ్చిన ఆరోపణపై కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించినా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. ఇప్పటికైన సదరు అధికారిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు.

మడికొండలో ఉచిత వైద్యశిబిరం

మడికొండ: హనుమకొండ కపిల్ ఆయుర్వేద చికిత్సాలయం ఆధ్వర్యంలో మడికొండలోని అంబేడ్కర్ సంఘం భవనంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మహంతి ఆధ్వర్యంలో నడుమునొప్పి, పక్షవాతం, మెడనొప్పులు, మోకాళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, నిద్రలేమి, నరాల బలహీనత, అధిక రక్తపోటు, కీళ్లనొప్పులు, కండరాల నొప్పులు, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ మహేందర్‌రెడ్డి, ఫార్మసిస్ట్ జ్యోతి, రమేష్ సిబ్బంది, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కాశెశ్వరపు రాజేందర్, జానపట్ల సారయ్య, వెన్నమల్ల రమేష్, మూల వెంకటస్వామి, మూల వీరస్వామి, బండారి మహేందర్, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ నిర్మాణంపై పునరాలోచించాలి

హన్మకొండ: హనుమకొండ జిల్లా నష్కల్ నుంచి ఎల్లాపూర్ వరకు నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రతిపాదిత బైపాస్ రైల్వేలైన్‌పై పునరాలోచించాలని దేవన్నపేట రైతులు కోరారు. ఈమేరకు బీజేపీ 65వ డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో దేవన్నపేట రైతులు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను ఆమె క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రం అందించారు. ఇప్పటికే జాతీయ రహదారి, దేవాదుల పైపులైన్, రైల్వేలైన్ విస్తరణతో భూములు కోల్పోయామని పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

నయీంనగర్: ఈనెల 14న హైదరాబాద్‌లో జరగనున్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని అంబేడ్కర్ మనువడు, వంచిత్ బహుజన్ అగాడీ జాతీయ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేడ్కర్ ఆవిష్కరిస్తారని ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి రంజిత్‌కుమార్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రంజిత్‌కుమార్ మాట్లాడుతూ మహనీయుడిని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కుంచం సాయిలు, టి.విశ్వనాథ్, టి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.